www.manaveluguepaper.in

# మన వెలుగు

తెలుగు దినపత్రిక | ప్రతి అక్షరం జనం కోసం

www.manaveluguepaper.in

సంపుటి:1 సంచిక:269 | ఆదివారం 31-5-2026 | పేజీలు:4 | వేల:3

**ఖమ్మం నగరంలోని టీఆర్ఆర్ ఆర్థో ఆక్సిడెంట్ కేర్ అధినేత ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తోట లక్ష్మణ్ వైద్య ప్రపంచంలో సరికొత్త రికార్డు!**



3లో..

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను

## ఉదయంపూట నిర్వహించాలి

ముందుటెండల నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

2లో



## ఇటు ఎండలు.. అటు వడగాలులు

**తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్**

**హైదరాబాద్ :** తీవ్రమైన వడగాల్పుల నేపథ్యంలో తెలంగాణలోని పలు జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో ఇవాళ తీవ్ర వడగాల్పులు వీచే అవకాశముందని హెచ్చరించింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు నిజామాబాద్, సిద్దిపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఇవాళ ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

## మోటార్లకు మీటర్లు బిగించం

# ఉచిత విద్యుత్ ఇవ్వకుంటే.. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చెయ్యం



**ఇస్తే మీరు పోటీచేయకుండా ఉంటారా?**

- మీడియా చిట్‌చాట్‌లో బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ సవాల్
- రైతుల ముసుగులో లబ్ధికి కేసీఆర్ రాజకీయ ఎత్తుగడలు
- ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం
- కొనకపోతే బీజేపీ ఎంపీల ఇళ్లముందు ధాన్యం పోస్తాం
- హరీశ్ భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదని ఎద్దేవా

**హైదరాబాద్ :** తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సిఎం రేవంత్ సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం

మిగతా 2లో..


## మా బంధం బలమైనది

మహేశ్‌కుమార్‌ది, నాది సక్సెస్‌ఫుల్ జోడీ

**వచ్చే పదేళ్లూ ఇలానే కలిసి పనిచేస్తాం: సీఎం రేవంత్**

**హైదరాబాద్ :** పీసీసీ అధ్యక్షుడు, తనది విజయవంతమైన కాంబినేషన్ అని, తమ నేతృత్వంలో అన్ని ఎన్నికలను గెలిచామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధిస్తామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. మహేశ్ కుమార్ గౌడ్‌కు మంచి పదవి వస్తుందని రేవంత్ మనసులో మాట చెప్పారు. ఇక 2034

మిగతా 2లో..



# పేదవాడి ఇంటి వద్దకే ప్రజాప్రభుత్వ పథకాలు

**పట్టణ పేదలకు సీఎం రేవంత్ రెడ్డి కానుక ఇందిరమ్మ ఇళ్లు**

- తొలి విడతగా లక్ష, మలి విడత మరో లక్ష ఇళ్ల నిర్మాణం
- ఏడాదిలోగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు మంత్రులుపొంగులేటి, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్‌లు శంకుస్థాపన



**హైదరాబాద్ :** పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగిలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. శనివారం బంజారాహిల్స్‌లో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట ఇళ్లు 30-40 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమని , ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు నిర్మిస్తామని ఇది పేదలకు పెద్దన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామని అన్నారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , సర్వే తదితర శాఖలు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల

మిగతా 2లో..

# అన్నివర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది

- రేవంత్, రాహుల్‌లకు గుణపాఠం చెపుదాం: కేటీఆర్
- ఒక్క ఏడాది ఆగండి, కాంగ్రెస్‌కు మిత్తితో చెల్లిద్దాం
- బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపు



**ముషీరాబాద్, మే 30 :** తెలంగాణ నిరుద్యోగ విద్యార్థి యువతకు యూత్ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసంపై రాహుల్ గాంధీని నిలదీయాలని తెలంగాణ యువతకు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ముషీరాబాద్ నియోజకవర్గానికి రాహుల్ గాంధీని తీసుకువచ్చి అడ్డగోలు హామీలిచ్చి, వారందరినీ మోసం చేసిన విషయాన్ని రేవంత్ రెడ్డికి కేటీఆర్ గుర్తు చేశారు. రాహుల్

మిగతా 2లో..

## రైతుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం



- రాష్ట్రంలో అధ్వానంగా ధాన్యం సేకరణ
- దళారీలు, అధికారులు, ప్రభుత్వం మధ్య రైతులు నలిగిపోతున్నారు : కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ధాన్యం సేకరణ అధ్వానంగా ఉందన్నారు. దళారీలు, అధికారులు, ప్రభుత్వం మధ్య రైతులు నలిగిపోతున్నారని

మిగతా 2లో..



రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పలగూడ నార్సింగ్ గ్రామాల పరిధిలోని ముష్కిన్ చెరువు ..

ఎఫ్‌టీఎల్ పరిధిలో జరిగిన ఆక్రమణలు తొలిగిస్తున్న హైడ్రా సిబ్బంది



## హైడ్రా మరో భారీ ఆపరేషన్

**ముష్కిన్ చెరువులో కబ్జాలకు గురైన రూ. 5500 కోట్ల విలువైన భూమి కాపాడుతూ ఫెన్సింగ్ ఏర్పాటు**

**రాజేంద్రనగర్, మే30 :** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పలగూడ నార్సింగ్ గ్రామాల పరిధిలోని ముష్కిన్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో జరిగిన ఆక్రమణలను హైడ్రా శనివారం తొలగించింది. చెరువు మధ్యలో కట్ట నిర్మించి, అభివృద్ధి పేరుతో చెరువు ఎగువ భాగంలోని 35.10 ఎకరాల భూమిని ఆక్రమించే ప్రయత్నాలను అడ్డుకుంది. స్థానికుల ఫిర్యాదుల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. గ్రామ రికార్డుల ప్రకారం చెరువు విస్తీర్ణం 59.11 ఎకరాలు కాగా, హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం 52.20 ఎకరాలు ఎఫ్‌టీఎల్ పరిధిగా నిర్ధారించారు. చెరువు పరిధిలో మట్టి నింపడం, చెత్త వేరు చేసే షెడ్లు ఏర్పాటు చేయడం, గుడిసెలు

మిగతా 2లో..

# కర్ణాటక సీఎంగా డీకే ఎన్నిక లాంఛనమే..

- కాంగ్రెస్ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఎన్నిక
- జూన్ 3న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం..?



**బెంగుళూరు :** కర్ణాటకలో నాయకత్వ మార్పు ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా డీకే శివకుమార్ ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం విధాన సౌధలో జరిగిన సీఎల్పీ సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు డీకేను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. శివకుమార్ పేరును మాజీ సీఎం సిద్ధరామయ్య ప్రతిపాదించగా సీనియర్ నేత పరమేశ్వర బలపరిచినట్లు తెలిసింది.

**జూన్ 3న డీకే ప్రమాణస్వీకారం..?**

కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పేరు దాదాపు ఖరారైనట్లు కనిపిస్తోంది. జూన్ మూడున ఆయన సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం 4 గంటలకు విధాన సౌధలో సీఎల్పీ సమావేశం జరగనుంది. ఈ భేటీలో డీకేను శాసనసభా పక్ష నేతగా ఎన్నుకోనున్నారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. వచ్చే బుధవారం శివకుమార్ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని సదరు వర్గాలు వెల్లడించాయి. ఇక, కొత్త మంత్రి వర్గంలో సిద్ధరామయ్య కుమారుడికి చోటు దక్కే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కర్ణాటక లో నాయకత్వ మార్పుపై కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ.. సిద్ధరామయ్య ఆ పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన రాజీనామాను రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్

మిగతా 2లో..

## ఏసీబీకి చిక్కిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆర్ఐ

- రూ.9 లక్షలు డిమాండ్
- రూ.4 లక్షలు తీసుకుంటుండగా పట్టివేత



**హైదరాబాద్ :** లంచం కేసులో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. సైబర్ మోసం కేసులో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చకుండా ఉండేందుకు ఓ వ్యక్తిని ఆయన రూ.9 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుడి నుంచి ఇప్పటికే రూ.5 లక్షలు నగదు తీసుకున్నారు. మిగిలిన రూ.4 లక్షల కోసం బెదిరింపులకు పాల్పడినట్లు ఆయనపై ఫిర్యాదు అందింది. ఈ క్రమంలోనే లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఇంట్లో సోదాలు నిర్వహించారు.

## ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి

**రాళ్లు, కోడిగుడ్లు, చెప్పలలతో దాడి ● ఇదంతా బీజేపీ పన్నాగమం అని ఎంపీ ఆగ్రహం**



### పాలకులే హంతకులుగా మారుతున్నారు

- అభిషేక్ బెనర్జీపై దాడిని ఖండించిన మమతా బెనర్జీ
- అభిషేక్ బెనర్జీపై దాడి హేయం
- తీవ్రంగా ఖండించిన ఖర్గే, అఖిలేష్

**కోల్‌కతా :** మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి జరిగింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో బాధితులను పరామర్శించేందుకు సోనార్‌పుర్ వెళ్లిన ఆయనపై స్థానికులు రాళ్లు, కోడిగుడ్లు చెప్పులు విసిరారు. కొందరు ఆయనపై చేయి చేసుకున్నారు. అభిషేక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గో బ్యాక్ అంటూ దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. దాడి జరుగుతున్న సమయంలో అభిషేక్ బెనర్జీ హెల్మెట్ ధరించగా.. భద్రతా సిబ్బంది ఆయనకు రక్షణగా నిలిచారు. అనంతరం చిరిగిన చొక్కాతో ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో మీడియాతో

మిగతా 2లో..

## బాల్క సుమన్‌కు 14 రోజుల రిమాండ్

**రెచ్చగొట్టే వ్యాఖ్యల కేసులో అరెస్టు**

**ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటానన్న బీఆర్ఎస్ నేత**

**హైదరాబాద్ :** సింగరేణి కార్యాలయాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ నమోదైన కేసులో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. సింగరేణి అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నాంపల్లి పోలీసులు.. శనివారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వద్ద బాల్క సుమన్ అరెస్టు చేశారు. అనంతరం ఆరున్నర గంటల పాటు విచారించారు. వైద్య పరీక్షల అనంతరం కోర్టు ముందు ప్రవేశపెట్టగా, జడ్జి రిమాండ్ విధించారు. అంతకుముందు బీఆర్ఎస్ పార్టీ కీలక నేత బాల్క సుమన్‌ను పోలీసులు

మిగతా 2లో..

## పశ్చిమాసియా యుద్ధ సంక్షోభం

# మళ్లీ మొదటికి?

**ఇరాన్‌తో డీల్‌పై సంతకం చేసేందుకు ట్రంప్ నో**

### అమెరికాకు మళ్లీ యుద్ధం ప్రారంభించే సత్తా ఉంది: హెగ్సేత్

**టెహ్రాన్ :** పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం ఇప్పుడప్పుడే ముగిసేలా కన్పించట్లేదు. ఇరాన్‌తో కాల్పుల విరమణ పొడిగింపు, హర్మూజ్‌లో దిగ్బంధనం ఎత్తివేతకు సంబంధించిన తాత్కాలిక ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయలేదు. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు మళ్లీ మొదటికొచ్చినట్లయ్యింది. ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునేందుకు శ్వేతసౌధం సిచ్యువేషన్ రూమ్‌లో ట్రంప్ తన సలహాదారులతో సమావేశమయ్యారు. దాదాపు రెండు గంటలపాటు వీరి మధ్య చర్చలు జరిగాయి. అయినప్పటికీ.. ఒప్పందంపై ఎలాంటి పురోగతి లేదు. ఈ డీల్‌పై సంతకం చేయకుండానే ట్రంప్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ పరిణామాలపై వైట్‌హౌస్ అధికారి మాట్లాడుతూ.. ఇరాన్‌తో కుదిరే

మిగతా 9లో..



గ్రీన్‌కార్డు నిబంధనలపై అమెరికా

## యూటర్న్

దరఖాస్తు దారులకు ఊరట

2

# బద్రీనాథా... ఈ ట్రాఫిక్ జామ్ ఏమిటయ్యా?



ఉత్తరాఖండ్ చమోలీ జిల్లాలో కదలని వాహనాలు
– కొన్నిచోట్ల 20 నుంచి 30 గంటల దాకా జామ్

చమోలీ, మే 30: చార్‌ధామ్ యాత్రలో భాగంగా బద్రీనాథ్ వెళుతున్న భక్తులు భారీ ట్రాఫిక్‌జామ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చార్‌ధామ్‌కు తోడు హేమకుండ్ సాహిబ్ యాత్ర కూడా ప్రారంభం కావడంతో ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లా జోషిమఠ్ సమీపంలోని కొండ ప్రాంతాల్లోని ఇరుకైన, గతుకుల రోడ్లలో గత మూడు రోజులుగా వాహనాలు చిక్కుకుపోతున్నాయి. పెద్ద సంఖ్యలో బారులుతీరిన వాహనాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్‌లో చక్కర్లు కొడుతున్నాయి. బద్రీనాథ్ హైవే జోషిమఠ్ సమీపంలోని 'జీరో బ్యాండ్' నుంచి 8కిలోమీటర్ల మేర శనివారం రోజంతా ఈ ట్రాఫిక్‌జామ్ నెలకొంది. జోషిమఠ్, విష్ణు ప్రయాగ్ వంటి చోట్ల 20–30 కి.మీ మేర వాహనాలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. వాహనాలు ముందుకు కదలకపోవడం, విశ్రాంతి స్థలాలు లేకపోవడం, గంటలతరబడి రోడ్ల మీదే ఉండాల్సి వస్తుండటంతో సరైన తిండి, నీరు లేక వేల సంఖ్యలో యాత్రికులు అవస్థలు పడుతున్నారు. పర్వతప్రాంతాల్లోని ఇరుకైన రోడ్లలో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. ట్రాఫిక్ సమస్య పరిష్కరించడానికి అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. జోషిమఠ్ ప్రాంతంలో గేట్ సిస్టమ్–వన్ వే ట్రాఫిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని ప్రకారం ఒకేవైపు నుంచి ఒకే దిశలో వాహనాలను కొద్దిసేపు అనుమతించి.. ఆ తర్వాత మరోవైపు వాహనాలను అనుమతిస్తారు. ఈ మేరకు 30 నిమిషాల చొప్పున మార్చి మార్చి అనుమతిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య నియంత్రించగలుగుతున్నామని అధికారులు తెలిపారు. భక్తుల తాకిడి భారీగా పెరిగినందున యాత్రికులు తమ ప్రయాణాలకు సంబధించి ప్రణాళికలను జాగ్రత్తగా రూపొందించుకోవాలని కోరుతున్నారు. బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రిలను కలుపుకొని ప్రతి ఏడాది సాగే చార్‌ధామ్ యాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారు.



# పసిడి డిమాండ్ ఢమాల్!

– 70 శాతం తగ్గిన గిరాకీ
– పనిచేసిన ప్రధాని పిలుపు

**కోల్‌కతా, మే 30**: దేశంలో బంగారానికి డిమాండ్ భారీగా తగ్గిపోయింది. ఏకంగా 70శాతం మేరకు డిమాండ్ పడిపోయిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఒక ఏడాదిపాటు బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకోవాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపుతోపాటు పసిడి దిగుమతులపై సుంకాన్ని 6 నుంచి 15శాతం పెంచిన నేపథ్యంలో స్వర్ణ విక్రయాలు డీలా పడ్డాయని వ్యాపారులు తెలిపారు. గత ఏడాది మే నెలలో 25 టన్నుల మేరకు బంగారం డిమాండ్ ఉండగా.. ఈ నెల 13న సుంకాలు పెంచిన తర్వాత పక్షం రోజుల్లో ఇది 7.5 టన్నులకు పడిపోయిందని పేర్కొన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన, వంట గ్యాస్ ధరలు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో బంగారాన్ని కొనుగోలు చేసేవారి సంఖ్య తగ్గిపోయిందని, ఇక, దిగుమతులపై సుంకాల పెంచడంతో ఆ ప్రభావం మరింత ఎక్కువగా పడిందని వ్యాపారులు తెలిపారు. ఇండియన్ బులియన్, జ్యుయలరీ అసోసియేషన్(ఐబీజేఏ) కార్యదర్శి సురేంద్ర మెహతా మాట్లాడుతూ.. దేశంలో బంగారం కొనుగోలు చేసేవారు భారీ గా తగ్గిపోయారన్నారు. "దిగుమతి సుంకంతోపాటు జీఎస్టీ కూడా పెరిగింది. ప్రస్తు తం పసిడిపై అన్ని రకాల పన్నులు 9.18శాతం నుంచి 18.45 శాతానికి చేరాయి. దీంతో వినియోగదారుల ప్రాధాన్యతా జాబితాలో పసిడి పక్కకు పోయింది" అని పేర్కొన్నారు. జోయాలుక్కాస్ సంస్థ చైర్మన్ జాయ్ అలుక్కాస్ మాట్లాడుతూ.. బంగారం డిమాండ్ తగ్గిపోవడానికి కేవలం దిగుమతి సుంకం ప్రభావమే కాకుండా మరిన్ని కారణాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు వినియోగదారులపై ప్రభావం చూపించిందని తెలిపారు. కాగా, శుక్రవారం స్వచ్ఛమైన బంగారం 10 గ్రాముల ధర జీఎస్టీ లేకుండా రూ.1.57 లక్షలుగా నమోదైంది. దీంతో కొంతమంది వినియోగదారులు.. తక్కువ క్యారెట్ల బంగారం కొనుగోలుకు మొగ్గుచూపుతున్నట్లు వ్యాపారులు తెలిపారు.

## మోటర్లకు మీటర్లు పెట్టం..

# ఉచిత్ విద్యుత్ ఇవ్వకుంటే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయం

పెరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోదీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా బీఆర్ఎస్ తన రాజకీయ లబ్ధి కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఏపిలో కూడా జగన్ స్మార్ట్ మీటర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇకపోతే మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఒత్తిడి తేవలన్నారు. లేకుంటే తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కేంద్రంలోని భాజపా సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. ధ్యాన్యం కొనకపోతే భాజపా నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఉదయంపూట నిర్వహించాలి

**మండుటెండల నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం**

మండుటెండల కారణంగా ఈసారి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుక లను ఉదయం పూట నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జూన్ 2న పేరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకలను ఉదయం 8.30కే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. జాతీయ పతాకావిష్కర ణతో పాటు అవతరణ ఉత్సవ కార్యక్రమాలను గంటన్నర వ్యవధిలో పూర్తి చేయాలని సూ చించారు. ఎండ తీవ్రత దృష్ట్యా వేడుకలకు హాజరయ్యే అతిథులకు, ప్రజలకు ఇబ్బంది లే కుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

### మా బంధం బలమైనది

వరకూ తాను రాష్ట్ర రాజకీయాల్లోనే కొనసాగుతానని మరోసారి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదని అన్నారు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం అని, పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే తానని గుర్తుచేశారు. వివాదాలు, సెంటమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదు అని సీఎం వ్యాఖ్యానించారు.

# అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది

గాంధీ వచ్చి డిక్లరేషన్ల పేరుతో ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని అడ్డగోలు హామీలు ఇచ్చి, విద్యావంతులైన యువకులతో కూడా ఓట్లు వేయించుకొని ఇప్పటిదాకా కనీసం మొహం కూడా చూపించడం లేదని కేటీఆర్ అన్నారు. తెలంగాణ యువతకు మా కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తే తిరిగి వచ్చి అండగా నిలబడతానని మాయమాటలు చెప్పిన రాహుల్ గాంధీ వారిని నట్టేట ముంచారని కేటీఆర్ ఆరోపించారు. కేవలం ఎన్నికల ప్రచారం ఎప్పుడు విద్యార్థుల నిరుద్యోగుల ఓట్లు దండుకొని ఇప్పుడు మొహం చాటేసారన్నారు. తెలంగాణ యువత రాహుల్ గాంధీని ఈ అంశంలో నిలదీయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా ఉద్యోగాలు ఇచ్చిందే లేదు అని, కేవలం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను భర్తీ చేసి చేతులు దులుపుకుందన్నారు. రాహుల్ గాంధీ తెలంగాణ యువతకు చేసిన ద్రోహాన్ని ఖచ్చితంగా ప్రశ్నించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈరోజు ముషీరాబాద్ లో జరిగిన పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. ఎాఎఖీ ఓటర్ల నమోదు అవకతవకలపై అప్రమత్తత ఉండాలి తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం సందర్భంగా, ప్రతి ఒక్క బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త జాగ్రత్తగా ఉండాలని.. అధికార కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చేసే ఎన్నికల ఓటర్ల నమోదుకు సంబంధించిన అవకతవకల పైన జాగ్రత్త వహించాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈరోజు ముషీరాబాద్ నియోజకవర్గ ముఖ్య పార్టీ కార్యకర్తల సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ పైన కేటీఆర్ ఒక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను ఇచ్చారు. పార్టీ తరఫున ఎంపిక చేసిన బూత్ లెవెల్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. పార్టీ తరఫున ఎంపిక చేసిన బీఎల్ఏలు (ఃఒంబ) ప్రతి ఒక్కరి ఓటు తొలగకుండా కాపాడేలా ప్రయత్నం చేయాలన్నారు. దీనితో పాటు కాంగ్రెస్ పార్టీ, బీజేపీ అడ్డగోలుగా డబుల్ ఓట్లను, దొంగ ఓట్లను రాయించే ప్రమాదం ఉన్నదని.. వీటిని అరికట్టేలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మరోవైపు, భారత రాష్ట్ర సమితి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ, హైదరాబాద్‌లో అద్భుతమైన విజయం సాధించిందని.. హైదరాబాద్ నగర ప్రజలు బీఆర్ఎస్ వెంట నిలిచారని కేటీఆర్ గుర్తు చేశారు. అయితే, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారులు, బీఆర్ఎస్ పార్టీ సానుభూతిపరులు, కార్యకర్తల ఓట్లను తొలగించే ప్రయత్నం అధికార కాంగ్రెస్ చేసే అవకాశం ఉన్నదని, ఈ అంశంలో జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్ కోరారు. హైదరాబాద్ నగరంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా భారత రాష్ట్ర సమితి ఘనవిజయం సాధిస్తుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. 10 సంవత్సరాల కాలంలో హైదరాబాద్ నగరానికి చేసిన అభివృద్ధి వలనే ఇది సాధ్యమైందన్నారు. హైదరాబాద్ నగరానికి రెండున్నర సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదు అని కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్ నగరంలో గత ప్రభుత్వం ఫ్లైఓవర్లు, డబుల్ బెడ్రూమ్ ఇండ్లు, రోడ్లు వంటి నిర్మాణాలు చేస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం 'హైడ్రా' పేరిట వేల ఇండ్లను కూల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. హైదరాబాద్ నగరానికి సంబంధించి గత ప్రభుత్వం నిర్మాణం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసం చేస్తున్నదన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంపై కేటీఆర్ కామెంట్స్‌వచ్చే నెల నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా చేపడుతున్నామని తెలిపిన కేటీఆర్, పూర్తి స్థాయిలో డిజిటల్ రూపంలో జరిగే ఈ సభ్యత్వానికి సంబంధించి పార్టీ శ్రేణులకు బూత్ వారీగా శిక్షణ కార్యక్రమాలు ఇస్తామని తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాల పైన, అన్యాయాల పైన కూడా పార్టీ శ్రేణులకు శిక్షణ ఇచ్చి.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడతామన్నారు. ఈరోజు ముషీరాబాద్ నియోజకవర్గంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు కూడా పాల్గొన్నారు.

# పేదవాడి ఇంటి వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు



పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు రంగానికి ధీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు , డిఐజి కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ – గోల్కొండ కార్యాలయాలు వస్తాయని వీటివలన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయన్నారు. వంద లాది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నమాజ్‌చేసుకుంటున్న ముస్లిం సోదరులకు ఏటా రెండు సార్లు నమాజు కార్యక్రమం నిర్వహించుకునేలా అధికారులను ఆదేశించామని ప్రకటించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా ఎంపీ అనీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక సీఎంగా డీకే ఎన్నికల లాంచనమే..

గహ్లోత్ శుక్రవారం ఆమోదించారు. దీంతో ఈ రోజు జరిగే సీఎల్పీ సమావేశంలో డీకేను ఏకగ్రీవంగా ఎన్నుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికారిక ప్రకటన మినహా కొత్త ముఖ్యమంత్రిగా ఆయన ప్రమాణస్వీకారం చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక, రాజీనామా అనంతరం దిల్లీ వెళ్లిన సిద్ధరామయ్య.. కొత్త క్యాబినెట్‌లో తన తరఫున మంత్రుల జాబితాను పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గేల పరిశీలన కోసం అందించారు. తన కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్రకు కీలక శాఖలతో పాటు ఉపముఖ్య మంత్రిగా అవకాశం ఇవ్వాలని ప్రత్యేకంగా కోరినట్లు తెలుస్తోంది. మరోవైపు, సిద్ధరామయ్య ప్రభుత్వంలోని మంత్రుల్లో దాదాపు సగం మందికి కొత్త మంత్రివర్గంలో చోటు ఉండకపోవచ్చని తెలుస్తోంది.

**ప్రమాణ స్వీకారం అక్కడే..**

కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసే వేదిక ఖరారైంది. బెంగళూరులోని లోక్‌భవన్ గ్లాస్ హౌస్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు జీసీ చంద్రశేఖర్ మీడియాకు వెల్లడించారు. అలాగే, ఇంధన సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులను వేదిక వద్దకు తీసుకువచ్చే ఆలోచనను విరమించుకున్నట్లు తెలిపారు.

## రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

ఆవేదన వ్యక్తం చేశారు. భాజపా చేపట్టిన బస్సు యాత్రతోనే రాష్ట్ర ప్రభుత్వంలో చలనం వచ్చిందన్నారు. 'కేంద్రం ధాన్యం తీసుకోవట్లేదని ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్నారు.. ధాన్యం సేకరణ రాష్ట్ర ప్రభుత్వం పని' అని స్పష్టం చేశారు. ఖరీఫ్‌లో 58.96లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని కేంద్రం, రాష్ట్రం మధ్య ఒప్పందం కుదిరిందని వివరించారు. కమీషన్లు, రియల్ ఎస్టేట్‌పైనే ప్రభుత్వం దృష్టి పెట్టిందని కిషన్‌రెడ్డి విమర్శించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేదని ఎద్దేవా చేశారు.

# హైడ్రా మరో భారీ ఆపరేషన్

ముష్కిన్ చెరువులో కబ్జాలకు రూ. 5500ల నిర్మించడం వంటి ఆక్రమణలను గుర్తించిన హైడ్రా ముందుగా అక్కడ నివసిస్తున్న వారికి నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించింది. అనంతరం గుడిసెలు, షెడ్లను తొలగించి చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. హైడ్రా చర్యలతో సుమారు రూ.5,500 కోట్ల విలువైన భూమి రక్షించబడినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సర్వే నంబర్ల వారీగా రక్షించిన భూమి సర్వే నెం. 259 20.23 ఎకరాలు (ప్రభుత్వ శిఖం భూమి) సర్వే నెం. 258 – 13.34 ఎకరాలు (ఎఫ్‌టీఎల్ పరిధి) సర్వే నెం. 260 – 8.19 ఎకరాలు (ఎఫ్‌టీఎల్ పరిధి) సర్వే నెం. 376 – 12.80 ఎకరాలు (ఎఫ్‌టీఎల్ పరిధి) సర్వే నెం. 379 –29 గుంటలు (ఎఫ్‌టీఎల్ పరిధి) హైడ్రా చర్యలను స్థానికులు స్వాగతిస్తూ, చెరువులో వేసిన మట్టిని పూర్తిగా తొలగించి చెరువును సంపూర్ణంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**పేదవారి పేరుతో కొట్టేసే ప్రయత్నాలకు చెక్**

పేదల పేరిట గుడిసెలు వేసి భూమిని కొట్టేయాలని రియల్టర్లు చేస్తున్న ప్రయత్నాలను అక్కడ గుడిసెలలో ఉన్న వారికి హైడ్రా అధికారులు వివరించారు. మిమ్ములను ముందు పెట్టి కబ్జాలకు పాల్పడుతున్నారంటూ నచ్చజెప్పారు. ఈ కబ్జాలపై దాదాపుగా ఏడాదిగా పరిశీలిస్తూ వచ్చిన హైడ్రా అక్కడ గుడిసెల్లో ఉంటున్న వారు ఖాళీ చేసేందుకు తగిన సమయం ఇచ్చింది. ఒకటికి రెండు సార్లు హైడ్రా అధికారులు వారితో మాట్లాడి.. 2 నెలల సమయమిచ్చారు. ఆక్రమణదారులు తమను పావులుగా వాడుకుంటున్నారని గ్రహించిన చాలామంది ఖాళీ చేసి వెళ్లిపోయారు. 40 నుంచి 50 వరకూ ఉన్న గుడిసెలతో పాటు.. చెత్తను వేరు చేసే షెడ్డులను ఖాళీ చేశారు. మరి కొంతమంది శనివారం ఉదయం ఖాళీ చేశారు. వాళ్లు ఖాళీ చేసిన తర్వాత హైడ్రా ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ పనులు పూర్తి చేసింది.



# ఖమ్మం నగరంలోని టీఆర్ఆర్ ఆర్తో ఆక్సిడెంట్ కేర్ అధినేత ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తోట లక్ష్మణ్ వైద్య ప్రపంచంలో సరికొత్త రికార్డు!

ఖమ్మం: 30.05.2026

ఖమ్మం నగరం వైద్య రంగంలో ఒక మెడికల్ హబ్ గా పేరిందిన తరుణంలో ఆర్థోపెడిక్ సర్జరీ రంగంలో మరో అరుదైన రికార్డును సాధించిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ తోట లక్ష్మణ్ సొంత హాస్పిటల్ స్థాపించిన 18 నెలల వ్యవధిలోనే వందలాది క్లిష్ట సర్జరీలను సైతం జయిస్తూ రోగుల ప్రముఖుల ప్రశంసలు పొందుతున్నారు. ఆర్థోపెడిక్ సర్జరీలలో 100% సక్సెస్ రేట్ ను సాధిస్తూ ఖమ్మం నగరంలో అత్యంత నమ్మకమైన ప్రతిభావంతుడైన ఆర్థోపెడిక్ సర్జన్ గా గుర్తింపు పొందుతున్నారు. ఈ 18 నెలల విజయోత్సవం సందర్భంగా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తోట లక్ష్మణ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి వైద్య వృత్తిలో ఆర్థోపెడిక్ సర్జన్ గా నా కెరియర్ ని ప్రారంభించి సొంత హాస్పిటల్ **TRR** ఆర్తో ఆక్సిడెంట్ కేర్ ను స్థాపించి 18 నెలలు పూర్తి చేసుకున్నామని మా ఈ ప్రయాణంలో అనేకమైన క్లిష్టమైన సర్జరీలను జయించి రోగుల ప్రాణాలను కాపాడుటంలో కృషి చేస్తున్నామని ఇది ప్రజలు పునర్జన్మగా భావించి వారు మాకిచ్చిన ఆశీర్వాదమే మా విజయానికి నాంది అని మా **TRR** హాస్పిటల్ లో ఎప్పటికప్పుడు ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా అత్యాధునికమైన వైద్య పరికరాలతో సామాన్యులకు అందుబాటులో ఉంచుతూ క్లిష్టమైన సర్జరీలను కూడా సులువుగా పూర్తి చేయగలుగుతున్నామని రోగులకు వైద్య సేవలతో పాటు టేక్ కేరర్ గా ఎప్పటికప్పుడు సంబంధిత సిబ్బందినీ అందుబాటులో ఉంచుతూ వారి భయాన్ని దూరం చేస్తున్నామని మా హాస్పిటల్ వైద్య సేవలకే కాకుండా ఈ వృత్తిలో అనేకమందికి ఉపాధి అవకాశాలు కలిపిస్తున్నామని నిరంతరం శ్రమించే తత్వం రోగుల పట్ల అంకిత భావమే మా విజయ రహస్యమని సాధారణ ప్రజల నుంచి ఎంతోమంది సెలబ్రిటీల వరకు మా వైద్యంపై నమ్మకం ఉంచడానికి ప్రధాన కారణం మేము సర్జరీ రంగంలో సాధించిన అద్భుతమైన సక్సెస్ రేట్ అని తెలియజేస్తూ నా ఈ ప్రయాణంలో అహర్నిశలు మాకు సహకరించిన ఖమ్మం రాజకీయ పుర ప్రముఖులకు, అధికారులకు మిత్రులకు శ్రేయోభిలాషులకు మా వైద్య సేవలు పొంది మా అభివృద్ధిని ఆకాంక్షించే మా సహచరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ మీ ఆదర అభిమానం మాకు ఎల్లప్పుడూ తోడు ఉండాలని తెలియజేశారు.






# శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు, కరెంటు తీగలతో ప్రమాదం ముంచుకొస్తుంది...

**- కొత్త స్తంభాలు, కరెంటు తీగలు ఏర్పాటు చేయాలి...**

**- నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి...**

**కీసర, మనవెలుగు ప్రతినిధి :** నాగారం డివిజన్ లో శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు, కరెంటు తీగలతో ప్రజలకు ప్రమాదం ముంచుకొచ్చే అవకాశం ఉందని తక్షణమే వాటిని తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి కొత్త కరెంటు తీగలను నెలకొల్పాలని నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి విద్యుత్ అధికారులను కోరారు. శనివారం నాగారం విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1972లో నిర్మించిన విద్యుత్ స్తంభాలు, కరెంటు తీగలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. గాలివానకు విద్యుత్ స్తంభాలు విరిగిపడి, కరెంటు తీగలు తెగిపోయి భారీ ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో హనుమాన్ దేవాలయం దగ్గర జరిగిన సంఘటనను అధికారికి వివరించారు. ప్రశాంత్ నగర్ లో జరిగిన సంఘటన తెలుపుతూ శిథిలావస్థకు చేరినటువంటి కరెంటు తీగలను, స్తంభాలను గుర్తించి వాటి స్థానాల్లో కొత్తవి ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. డిఈ సానుకూలంగా స్పందించి మూడు రోజుల్లో శిథిలావస్థలో ఉన్న వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీ ఈ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్క కిషోర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వహావా... సిరి

**-హాయ్..హలో...నమస్తే...లిఅంటూ సభికులను కట్టిపడేస్తున్న సొగస(సి)రి...**

**-తన వాక్చాతుర్యంతో సాక్షాత్తు సినీ నటి నేహా శెట్టితో శభాష్ అనిపించుకున్న ఖమ్మం భామ...**

**-అందం..అభినయం.. వ్యాఖ్యానాలతో మెక్ కే కేక పుట్టిస్తున్న అతివ.**

**-పదేండ్లలో ఈవెంట్లతో రారాణి గా విరాజిల్లుతున్న ఖమ్మం సిరి..**

**- టీవి రంగం నుంచి మొదలైన సిరి ప్రస్థానం...బిగ్ బాస్ లో ప్రవేశ ఆరాటం...**

**- లక్ష సంఖ్యను దాటేసిన సిరి ఈవెంట్స్...**

**- హీరో మహేష్ బాబు మూవీ ట్రైలర్ కు యాంకరింగ్ చేసి మెప్పు పొందాలని తహతహ..**

**ఖమ్మం.. మన వెలుగు జానిపాషా సీనియర్ జర్నలిస్ట్ :**
తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఇలాంటి శుభకార్యం.. జరిగినా... బారసాల ఫంక్షన్ వద్ద నుంచి మొదలుకొని వివాహ శుభకార్యాల వరకు ఈ ఖమ్మం భామ అక్కడ మైకు పట్టాల్సిందే...అందరిని తన వాగ్దాటితో మైమరపింపస్తోంది...


హాయ్..హలో...నమస్తే...అటూ... సభికులను కట్టిపడేస్తున్న సొగస(సి)రి...2016 లో తన మేని ఛాయాతో మెనీ ఈవెంట్స్ తో తన తియ్యటి స్వరంతో.... అందరిని పాదాల అల్లికల పల్లకిలో కట్టి పడేసి... అడుగు బయటికి వేస్తే... చిత్ర దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాటల వలే ఉన్న సందర్భాలు మిస్ అయితాయోమో ననే భావనలో ఈ మిస్ ను మిస్ కాకుండా... తన వ్యాకరణాలను అలా... చూస్తూ.. కరతాలధ్వనులకే పనిచెబుతారు సభికులు.. ఇంతకి ఈ అందాల అమ్మడు.. ఎవరనేదే కదా మీ సందేహం.... ఇంకెవరండి... మన ఖమ్మం ముద్దుగుమ్మ సొగస(సి)రి... మన సిరి...తన మాటలతో స్టేజి నే దడ దడలాడిస్తుంధీ అమ్మడు... తన వాక్చాతుర్యంతో సాక్షాత్తు సినీ నటి నేహా శెట్టితోనే శభాష్ సిరి అనిపించుకుందీ ఖమ్మం భామ... తన అందం..అభినయం.. వ్యాఖ్యానాలతో చేతిలో వున్న మెక్ కే కేక పుట్టిస్తున్న అతివ కు అతి లేదనే చెప్పొచ్చు...ఈ పదేండ్లలో తన ఈవెంట్లతో రారాణి గా విరాజిల్లుతున్నారు..

టీవి రంగం నుంచి మొదలైన సిరి ప్రస్థానం... హీరో నాగార్జున బిగ్ బాస్ లో ప్రోగ్రామ్ లో ప్రవేశం లభించాలని వేచిచూస్తూ అవకాశాలకోసం పరితపిస్తుంది...ఈ అమ్మడు..
ఇప్పటికే తన ఈవెంట్స్ టాలెంట్ లక్ష సంఖ్యను దాటేసిందని సగర్వంగా పేర్కొంది ఈ ముద్దుగుమ్మ...
రెండు తెలుగు రాష్ట్రాలలో తన ఈవెంట్లతో వారి వారి కుటుంబ సభ్యులకు ఆహ్లాదాన్ని ఆనందాన్ని పంచుతున్న ఖమ్మం భామ సిరి త్వరలో హైదరాబాద్లో ఏదైనా ఒక చిత్రానికి సంబంధించిన హీరో మహేష్ బాబు మూవీ ట్రైలర్ కు యాంకరింగ్ చేసే ఛాన్స్ రాకపోదా వస్తే సాక్షాత్తు హీరో మహేష్ బాబుతో మెప్పు పొందాలని ప్రముఖ వ్యాఖ్యాత... నటి...సిరి తహ తహ లాడుతోంది... ఖమ్మం ముద్దుగుమ్మ సొగసిరి ఆశలు ఆకాంక్షలు నెరవేరాలని ఆశిద్దాం...









# డిజిపిని కలిసిన ఎమ్మెల్యే కూనంనేని, సిపిఐ నేత జానిమియా

ఖమ్మం మన వెలుగు ప్రతినిధి
తెలంగాణ రాష్ట్ర డిజిపిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ ను కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ ఇతర అంశాలపై చర్చించారు. సివి ఆనంద్ పాలనలో పోలీసులు మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా జీవించాలని కూనంనేని ఆకాంక్షించారు. కూనంనేని వెంట సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సమితి –సభ్యులు ఎస్కె జానిమియా తదితరులు ఉన్నారు.



# ఘనంగా సిఐటియు ఆవిర్భావ వేడుకలు



**కీసర, మన వెలుగు ప్రతినిధి :** కీసర మండలంలో ఘనంగా సిఐటియు ఆవిర్భావ వేడుకలను జరుపుకున్నారు. 56వ సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కీసర మండలం జిన్నారం కాలనీ సిఐటియు యూనియన్ కార్యాలయం వద్ద మండల సిఐటియు కన్వీనర్ బంగారు నర్సింగరావు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం కార్మిక సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిరంతరం పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తార మంజుల భాయ్, పూజిత భాయ్, మాధురి భాయ్, యాదమ్మ పోచమ్మ సాయమ్మ సుశీల లక్ష్మి గౌరీ తులసి భారతి, సత్తయ్య, శశి రాజు, మంగుతా నాయక్ తోపాటు జన్నారం కాలనీ మహిళలు సిఐటియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కార్మికులు బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**– భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు**



**జవహర్ నగర్, మన వెలుగు ప్రతినిధి :** సెంట్రింగ్ కార్మికులు భవన నిర్మాణ కార్మికులపై చేసిన అనుచిత వ్యాఖ్యలు తగదని, బేషరతుగా క్షమాపన చెప్పాలని భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సెంట్రింగ్ కార్మికులు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జవహర్ నగర్ లోని భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులు అన్నదమ్ములలాంటి వారని, మనస్పార్థాలు పెట్టుకోవద్దని అన్నారు. ఇంటి నిర్మాణంలో వీడదీయలేని బంధం ఉంటుందని, మన హక్కుల కోసం కలిసికట్టుగా పోరాటాలు కొనసాగించాలని పేర్కొన్నారు. తాపీ మేస్త్రీలపై చేసిన మాటలు వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకుండా పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, వెంకటేష్, బూడిద వెంకటేష్, మల్లేష్, రమణారెడ్డి, చెన్నారెడ్డి, శ్రీను, మురళి, శాంతయ్య, రాములు, నర్సింహా, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమ నిర్మాణదారులపై క్రిమినల్ కేసులే

**– కాప్రా తహసీల్దార్ బైరెడ్డి రాజేష్**

**జవహర్ నగర్, మనవెలుగు ప్రతినిధి :** అక్రమ నిర్మాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, జవహర్ నగర్ లో పూర్తిగా సర్కారు భూములే ఉన్నాయని, పేద ప్రజలు ప్లాట్లు కొని మోసపోవొద్దని తహసీల్దార్ రాజేష్ హెచ్చరించారు. కాప్రా తహసీల్దార్ రాజేష్ ఆదేశాల మేరకు జవహర్ నగర్ లోని పలు అక్రమ కట్టడాలను శనివారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ సమక్షంలో కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ... ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తున్నామని, కబ్జాదారులపై పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని అన్నారు. అంబేద్కర్ నగర్, వికలాంగుల కాలనీ, బీజేఆర్ నగర్ లో అక్రమంగా వెలిసిన కట్టడాలను కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





# నాగారం డివిజన్‌లో డ్రైనేజీ, అభివృద్ధి పనులు చేపట్టాలి



**కీసర, మన వెలుగు ప్రతినిధి :** కీసర మండలం నాగారం డివిజన్ లోని పలు అభివృద్ధి పనులు, డ్రైనేజీల నిర్మాణం, మౌలిక సదుపాయాలను చేపట్టాలని నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు కౌకుట్ల జీవన్ రెడ్డి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తను కలిసి వినతి పత్రం అందజేశారు. బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తో కలిసి జోనల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. నాగారం డివిజన్ లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తెచ్చారు. స్పందించిన జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రాధాన్యత ఉన్న ప్రాంతాలలో తప్పనిసరిగా అభివృద్ధి పనులు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు.